క్లుప్తంగా

విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించాలి

వినుకొండ(నూజెండ్ల): గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, మండల కేంద్రాలకు వచ్చి ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకునే విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1 నుంచి 10వ తరగతి వరకు చదువకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా పాసులు ఇచ్చి ప్రయాణం చేస్తున్నారని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కూడా ఉచితంగా పాసులు ఇప్పించి ప్రయాణం కల్పించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

జాతీయ తైక్వాండో పోటీలకు తులసీతన్మయ్



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ద్వితీయ సంవత్సరం నర్సింగ్ విద్యార్థిని వి.తులసీతన్మయ్ జాతీయస్థాయి తైక్వాండ్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ సోమవారం తెలిపారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ద్వితీయ అస్మితా తైక్వాండో ఉమెన్స్ లీగ్–2024 రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో తులసీ తన్మయ్ ప్రతిభ చూపి ఆంధ్రప్రదేశ్ సీనియర్స్ మహిళా టీంకు ఎంపికైనట్టు వివరించారు. తమిళనాడులోని దిండిగల్‌లో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న తైక్వాండో పోటీలలో తులసీ తన్మయ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. జాతీయస్థాయి పోటీలో పాల్గొంటున్న తులసీ తన్మయ్‌ను కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

ఆర్మీ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే జీవీ



వినుకొండ(నూజెండ్ల): టెరిటోరియల్ ఆర్మీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సైనిక సిబ్బంది దేశవ్యాప్త సైకిల్ ర్యాలీ చేపట్టారు. కాశ్మీర్‌లోని సియాచిన్ బేస్ నుంచి మొదలైన ఆర్మీ సైకిల్ యాత్ర ఆదివారం వినుకొండకు చేరుకుంది. సోమవారం ఉదయం వెన్నెల మార్కెట్ వద్ద నుంచి మొదలైన ఆర్మీ ర్యాలీని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి ప్రారంభించారు. సైనిక సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే సైకిల్ ర్యాలీలో పాల్గొని లయోలా హైస్కూల్ వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ పాల్గొన్నారు.

అదుపు తప్పి.. పల్టీకొట్టి..




నరసరావుపేట రూరల్: రావిపాడు రోడ్డులో కారు అదుపుతప్పి కాలువలోకి పల్టీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు నకరికల్లు నుంచి నరసరావుపేటకు వస్తున్న కారు రావిపాడు ఎస్సీ కాలనీ సమీపంలోకి రాగానే అదుపు తప్పింది. పక్కనే కాలువలోకి కారు పల్టీ కొట్టింది. స్థానికులు వెంటనే స్పందించి కారులో ఉన్న డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం సీతారామపురంలోని ఎస్.వి.ఎస్.సీ. హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి రెడ్డికొత్తూరు గ్రామానికి చెందిన తుపాకుల వీరభద్రారెడ్డి (2001–06 బ్యాచ్) కంప్యూటర్, స్పీకర్స్‌ను బహూకరించారు. దాత వీరభద్రారెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. కామేశ్వరరావు శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

కాలనీలో తహసీల్దార్ పర్యటన

నరసరావుపేట రూరల్: వరద ముంపునకు గురవతున్న రాజుపాలెం ఎస్సీ కాలనీని తహసీల్దార్ కె.వేణుగోపాల రావు సోమవారం సందర్శించారు. కాలనీలో నిలిచి ఉన్న నీటిని పరిశీలించారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్, షాలెంనగర్, బాపనయ్య నగర్, విద్యానగర్, గాంధీనగర్‌ల నుంచి మురుగునీటితో పాటు వర్షపు నీరు కలిసి కాలనీని ముంచెత్తుతుందని కాలనీవాసులు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాలనీ ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.వి.ఎస్.ప్రసాద్, గంగుల పెద్దిరెడ్డి, యాదల మహానంద రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



పేటలో మొక్కజొన్న పొత్తులతో పూజలందుకున్న అమృత మహావీర గణపతి



నరసరావుపేట ఎన్జీఓ కాలనీలో కొలువుదీరిన గణనాథుడు



రొంపిచర్ల వల్లభేశ్వరి స్వామి ఆలయంలో మూడవ రోజు పూజలు అందుకున్న స్వామివారు



నాదెండ్ల మండలం గణపవరంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



నరసరావుపేటలో నిమజ్జనానికి తరలుతున్న గణపతి



గణపవరంలో రూ.44 వేలకు లడ్డూ దక్కించుకున్న తెలంగాణ ఇరిగేషన్ అధికారి నాగశివ

ఓ బొజ్జ గణపయ్య..



నరసరావుపేటఎన్జీఓ కాలనీ పందిరిలో భక్తజన సందోహం



రొంపిచర్లలో నిమజ్జనానికి బయలుదేరిన సంతగుడిపాడు బ్యాంక్ సెంటర్‌లోని వినాయకుని విగ్రహం



శావల్యాపురంలో స్వామివారి లడ్డూని దక్కించుకున్న శ్రీనివాసరావు

వైభవంగా చవితి నవరాత్రులు

నరసరావుపేట ఈస్ట్: చవితి పందిళ్లలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు మూడవ రోజు వైభవంగా కొనసాగాయి. ఆయా పందిళ్లలో ఉదయం గణపతి హోమాలు, పూజలు, సాయంత్రం పూజాధికాలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద పందిరిలోని క్షీరసాగర శ్రీ అమృత మహావీర గణపతిని సోమవారం 1,108 మొక్కజొన్న పొత్తులతో పూజించారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చిన్న చిన్న పందిర్లలోని గణనాధులను సాయంత్రం నిమజ్జనానికి తరలించారు.

వినాయకుని లడ్డూ రూ.44 వేలు

నాదెండ్ల: మండలంలో గణనాథుని నిమజ్జనాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటూ పూజలందుకున్న గణనాథుడిని ఊరేగింపుతో నిమజ్జనానికి తరలించారు. మండల పరిధిలో 15 విగ్రహాలకు గాను గణపవరంలో 5, నాదెండ్లలో 4, సాతులూరులో 2, చిరుమామిళ్ల, ఇర్లపాడు, చందవరం, అప్పాపురం గ్రామాల్లో ఒక్కోటి చొప్పున గణనాధుడి విగ్రహాల నిమజ్జనం చేశారు. గణపవరం కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణనాథుడి 15 కేజీల లడ్డూ వేలం నిర్వహించగా, తెలంగాణ మక్తల్ నియోజకవర్గం ఇరిగేషన్ అధికారి ఐనోలు నాగశివ రూ.44 వేలకు దక్కించుకున్నారు. పదకొండు కేజీల రెండో లడ్డూను గణపవరం విఘ్నేశ్వర ట్రాక్టర్స్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు దక్కించుకున్నారు. లడ్డూ దక్కించుకున్న ఇరువురినీ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి మేళతాళాలతో ఇండ్ల వరకూ తోడ్కొని వెళ్లారు. అనంతరం గణపవరం కుప్పగంజి వాగులో గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కెల్లంపల్లి సుందరరావు, సభ్యులు కెల్లంపల్లి అచ్చయ్య, గాలి బుచ్చయ్య, కాటా రత్తయ్య, అయితా శ్రీనివాసరావు, సింగు సత్యనారాయణ, పవన్‌కుమార్ పర్యవేక్షించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో కాకతీయ సేవా సమితి యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ వార్షికోత్సవం పురస్కరించుకుని కమిటీ సభ్యులు వేడుకలు వైభవంగా నిర్వహించారు. శావల్యాపురం గ్రామానికి చెందిన దురిశాల సత్యనారాయణ–రమాదేవి దంపతులు విగ్రహాన్ని వితరణ చేశారు. 20 కేజీల లడ్డూను గ్రామానికి పాలడగు సత్యనారాయణ దంపతులు అందజేశారు. వినాయక విగ్రహం లడ్డూను బహిరంగ వేలంపాటలో గ్రామానికి చెందిన గురజాల శ్రీనివాసరావు రూ.40 వేలకు కైవసం చేసుకున్నాడు. భారీ అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. విగ్రహం నిమజ్జనం వేడుకల్లో భాగంగా మేళ తాళాలు కనకతప్పెట్ల నడుమ విగ్రహాన్ని విద్యుత్ కాంతులతో ఘనంగా ఊరేగించారు. గణనాథుడి నిమజ్జనం వేడుకల్లో యువకులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.



నరసరావుపేట రామిరెడ్డిపేట పందిరిలో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

నిబంధనలు తప్పనిసరి

వినాయక విగ్రహాలు నిమజ్జనం వేడుకల్లో కమిటీ సభ్యులు పోలీసు నిబంధనలు పాటించాలని వినుకొండ రూరల్ సీఐ బి. ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని మతుకుమల్లి, కారుమంచి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రూరల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లు అన్నీ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే సమయంలో యువకులు కమిటీ సభ్యులు సంయమనం పాటించాలన్నారు. ఆయనతో పాటు ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితిని పురస్కరించుకొని పందిళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సంతగుడిపాడు బ్యాంక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి అలాగే బుచ్చిబాపన్నపాలెంలో ఏర్పాటు చేసిన మరో విగ్రహానికి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. సంతగుడిపాడు వినాయకుని విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నకరికల్లు మండలం చల్లగుండ్ల అడ్డరోడ్డులోని గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. బుచ్చిబాపన్నపాలెం గ్రామంలోని వినాయకుని విగ్రహాన్ని ఆ గ్రామ సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. అలాగే విప్పర్ల గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని మట్టి విగ్రహానికి మూడువ రోజు పూజలు ఘనంగా నిర్వహించారు.



కోలాట ప్రదర్శన చేస్తున్న గణపవరం విద్యార్థినులు

నాయకుల పూజలు

నరసరావుపేట: వినాయకచవితి పర్వదినం సందర్భంగా ఎన్జీవో కాలనీలో ఏర్పాటు చేసిన చవితి మండపాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం సందర్శించి వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రకాష్‌నగర్ రెండో లైనులో క్రేజీ ఫ్రండ్స్ ఏర్పాటుచేసిన చవితిపందిరిని ఆదివారం రాత్రి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆయా మండపాల నిర్వాహకులు ఘనస్వాగతం పలికి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బారాయగుప్తా, వైఎస్సార్‌సీపీ నాయకులు కేపీ రంగారావు, నిడమానూరి సురేంద్ర, చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ మాజీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌బాబు, టీడీపీ నాయకులు కొండ్రకుంట కృష్ణ, డాక్టర్ వున్నం మల్లిఖార్జున రావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రకాష్‌నగర్‌లో చవితి పందిరిని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ఎన్జీవో కాలనీలో చవితిపందిరిని సందర్శించిన ఎంపీ లావు

త్రికోటేశ్వర రైతు సంఘం కార్యాలయం ప్రారంభం

నరసరావుపేట రూరల్: లింగంగుంట్లలో త్రికోటేశ్వర రైతు సంఘం కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. లింగంగుంట్ల అగ్రహారం భూముల సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ త్రి కోటేశ్వర రైతు సంఘాన్ని 2007లో రైతులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. కార్యాలయంలో లింగంగుంట్ల భూములకు సంబంధించిన డాక్యుమెంట్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. రైతులు తమ ఇళ్లు, ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు నకళ్లను తీసుకు వచ్చి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సర్వీస్‌లో సరి చూసుకోవాలని సూచించారు. లింగంగుంట్ల అగ్రహారం రైతుల భూములను సాగుభూములు, ఇల్లు, కమర్షియల్ స్థలాలుగా మూడు వర్గాలుగా విభజించడం జరిగిందన్నారు. రైతులు తమ భూములు ఏ పరిధిలోకి వస్తాయో ముందుగానే నమోదు చేసుకోవాలన్నారు. దీని ప్రకారం పుష్పగిరి పీఠం అధికారులు, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించిన పన్ను పరిధిలోకి భూములు వస్తాయని వివరించారు. అయా వర్గాలు పుష్పగిరి మఠం నిర్ణయించిన ధర చెల్లించిన మీదట ఆయా రైతుల పేరుపై రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొన్నపాటి ఈశ్వర రెడ్డి, యాదాల మహానంది రెడ్డి, కామిరెడ్డి నర్సిరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, యేరువ బాలమోహన రెడ్డి, పొన్నపాటి వీరారెడ్డి, యన్నం రవీంద్రా రెడ్డి, ఉడతా రాఘవ తదితరులు పాల్గొన్నారు.



లింగంగుంట్లలో రైతు సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

బాల్ బ్యాడ్మింటన్‌కు బాలికల ఎంపిక

శావల్యాపురం: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఏడుగురు బాలికలు ఎంపికై నట్లు శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపికైన బాలికలతో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చూపి శావల్యాపురం హైస్కూలకు మంచి పేరు తేవాలన్నారు. వేముల దివ్య (ఇంటర్) మూట్లూరి లూధియా (ఇంటర్) బండారు దేవమణి (ఇంటర్) ఆర్.రత్నకీర్తన (10వ తరగతి) బండారు రవళీ (9వ తరగతి) ఉప్పు లలిత (9వ తరగతి) చల్లా శ్రీహర్షిత (9వ తరగతి) ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 15 తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే తొమ్మిదవ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్ కుమార్, స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, శ్రీకాంత్, భువనేశ్వరీ ప్రత్యేకంగా అభినందించారు.



ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

మావోయిస్టులతో చర్చలు జరపాలి

నరసరావుపేట: తెలంగాణ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేసి మావోయిస్టులతో ఆయా ప్రభుత్వాలు చర్చలు నిర్వహించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయ ప్రాంగణంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.వెంకటేశ్వర రావు, ఏపీ గిరిజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటనాయక్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తాము గెలిస్తే ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించి గెలిచిన అనంతరం బూటకపు ఎన్‌కౌంటర్లకు తెర తీసిందన్నారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, ప్రజా కళ మండలి రాష్ట్ర ట్రెజరర్ ఉన్నం నాగేశ్వరరావు, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శిఖినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి సందర్శించారు. చందవరం గ్రామానికి చెందిన రైతు శివనాగేశ్వరరావు కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తున్నారు. తనకున్న ఎకరం పొలంలో ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా అనేక రకాల కూరగాయలు, పండ్లు, తీగ, దుంపజాతి కూరగాయలు పండిస్తున్నారు. ఆయన ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచే పద్ధతి అనుసరిస్తూ నిరంతర ఆదాయం పొందుతున్నారు. ఘనజీవామృతం, ద్రవ జీవామృతాలను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ నెలకు సగటున రూ.25–30 వేల ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ రైతు శివనాగేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని ఏక కాలంలో పలు రకాల కూరగాయలు, పండ్లను పండించటం వలన నేలతల్లి ఆరోగ్యం బాగుండి మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలను ఆర్‌బీకేల్లో ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు ప్రసాద్‌కు సత్కారం



నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న పెండ్యాల ప్రసాద్ ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్న సందర్భంగా సోమవారం తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ నెల 5న ప్రసాద్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటరావు మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే చక్కటి ఫలితాలతో పాటూ గుర్తింపు సాధించవచ్చన్నారు. 2017లో కావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బదిలీపై ఈ పాఠశాలకు వచ్చారని, ఏడాది కాలం ఇన్‌చార్జి హెచ్‌ఎంగా సైతం విధులు నిర్వర్తించారని, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించటం హర్షణీయమన్నారు. ఆయన్ను తోటి ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

నలుగురు దొంగలకు రిమాండ్

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో అర్ధరాత్రి దొంగతనం చేస్తూ పట్టుబడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు ఆగస్టు 27న గ్రామానికి చెందిన బేతంచర్ల హనుమంతరావు ఇంటితో పాటూ మరో ఇంటిని దోచుకునేందుకు ఎనిమిది మంది దొంగలు ప్రయత్నించారు. నాలుగు బైక్‌లపై వచ్చిన వీరిని స్థానికులు గుర్తించి వెంటపడ్డారు. నలుగురు బైక్‌లపై పారిపోగా, మరో నలుగురు పట్టుబడ్డారు. దొరికిన వారిలో పిడుగురాళ్లకు చెందిన కొత్తపల్లి ఎలీషా, కుంచెపు వెంకటకృష్ణ, నంబూరుకు చెందిన పాదిలి మనోహర్, గుంటూరులోని గోరంట్లకు చెందిన వంగా గణేష్ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపల్లి ఎలీషా, వెంకట కృష్ణలపై గతంలో కేసులు ఉన్నాయి. ఇటీవల సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, గుంటూరు, నల్లపాడు, మేడికొండూరుల్లో పలు దొంగతనాలకు పాల్పడ్డారు. పరారీలో ఉన్న నలుగురి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కోర్టుకు హాజరుపరచిన నలుగురికీ న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

జూదరుల అరెస్టు

నాదెండ్ల: యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలో సచివాలయం సమీపంలో కోతముక్క ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి పదకొండు మంది జూదరులను అరెస్టు చేశారు. ఎస్సై వి.బాలకృష్ణ, సిబ్బందితో దాడి చేసి నిందితుల వద్ద నుంచి రూ.3270లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ వినుకొండ ప్రాజెక్టు పరిధిలోని ఏ సెక్టార్‌లో గల ఓబయ్య కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఎం.అనురాధ మాట్లాడుతూ పౌష్టికాహారంతో రక్తహీనత నివారించవచ్చని, అందుకే గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహార పంపిణీ చేస్తున్నామన్నారు. చిరు ధాన్యాల వాడకం అత్యవసరమన్నారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని, ఆ తరువాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకున్నట్లయితే కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జఫ్రుల్లా, అంగన్‌వాడీ టీచర్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.









అధ్వానం

బొల్లాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వీధులన్నీ చిత్తడిగా తయారయ్యాయి. ఇక్కడ పారిశుద్ధ్యం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గ్రామాల్లో అంతర్గత రహదారులు సరేసరి. వీధుల్లో బురదమయంగా మారి పాదాచారులు అసహనానికి గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో సైడ్‌కాలువలు లేక, ఉన్నప్పటికీ పూడికతీత పనులు చేపట్టడం లేదు. దీంతో కాలువలు నిండి నీరంతా వీధుల్లో ప్రవహిస్తూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక మేళ్లవాగు నీరు ప్రధాన రహదారిపై నిలిచి రహదారి అంతా బురదమయంగా తయారైంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

– బొల్లాపల్లి